క్లుప్తంగా

ప్రశాంతంగా ఇంటర్మీడియట్ ఇంగ్లిష్ పరీక్ష

పెడన: ఇంటర్మీడియట్ పరీక్షలు మొదటి సంవత్సరం విద్యార్థులకు మంగళవారం ఇంగ్లిష్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పట్టణంలో శ్రీబొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సెంటరులో 212 మంది విద్యార్థులకు 205 మంది హాజరయ్యారని చీఫ్ సూపరిండెంట్ రామారావు, డిపార్ట్‌మెంటు అధికారి మున్వనర్ తెలిపారు. విజయానంద జూనియర్ కళాశాల కేంద్రంలో 132 మందికి గాను 124 మంది హాజరయినట్లు చీఫ్ సూపరిండెంట్ హిరణ్మయి, డిపార్ట్‌మెంట్ అధికారి నిజాముద్దీన్ పేర్కొన్నారు.

మహిళా సంరక్షణపై వక్తృత్వ పోటీలు



మోపిదేవి: మహిళా దినోత్సవాల్లో భాగంగా మోపిదేవి జెడ్పీ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు 'బహిరంగ ప్రదేశాల్లో మహిళా సంరక్షణ' అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం పీ జయంతి ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రాయింగ్, పెయింటింగ్ పోటీల్లో పలువురు బాలికలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్‌ఐ సత్యనారాయణ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలతోపాటు వివిధ ప్రదేశాల్లో విద్యార్థినులు, మహిళలు తమను తాము ఎలా సంరక్షించుకోవాలో అవగాహన కల్పించారు. వక్తృత్వ పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులను ఎస్‌ఐ అభినందించారు.

ఉచిత దంత వైద్య శిబిరం

మచిలీపట్నంటౌన్: కృష్ణా జిల్లా మహిళా దంత వైద్యుల సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా నగరంలోని వలందపాలెం మహాత్మా జ్యోతీబా పూలే బాలికల వసతి గృహంలో మంగళవారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని విద్యార్థినులకు పలువురు మహిళా వైద్యులు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. దంత సంరక్షణపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం దంత వైద్యురాలు ఎ. ప్రతిభను సత్కరించారు. కార్యక్రమంలో దంత వైద్యులు ఉషాకాంతి, రావి యువరాజ్, శ్రీనివాస్, శారద (చల్లపల్లి), అజిత, సంపత్, లక్ష్మి, థియోఫిలస్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా యాదవులకు ప్రాధాన్యం ఇవ్వాలి



పెడన: ఎమ్మెల్సీగా యాదవ సామాజిక వర్గానికి అవకాశం ఇవ్వాలని శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం పెడన నియోజకవర్గ అధ్యక్షుడు గంగుమోలు శివన్నారాయణ డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. శివన్నారాయణ మాట్లాడుతూ శాసనమండలిలో ఖాళీ కానున్న ఐదు ఎమ్మెల్సీ స్థానాల్లో ముగ్గురు యాదవ సామాజిక వర్గానికి చెందిన వారే ఉన్నారని తెలిపారు. కావున ఒక స్థానాన్ని కృష్ణాజిల్లాకు చెందిన యాదవులకు ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఆ సంఘ నాయకులు కన్నెకోటి సాయికిరణ్, చేవూరి విజయకుమార్, పుట్టి కృష్ణప్రసాద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయుడికి 1008 పెన్నులతో పూజలు



మచిలీపట్నం టౌన్: నగరంలోని ఈడేపల్లిలో వేంచేసి ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం 1008 పెన్నులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజకు సూర్య అండ్ సన్స్ దుకాణం యజమాని వడ్డి కోటేశ్వరప్రసాద్, వడ్డి ఫణి సహకారం అందించారని భక్త బృందం తెలిపింది. అలాగే పానకంను చావా వెంకట రంగనాథ్, ప్రసాదాన్ని మేకపోతుల సురేంద్రనాథ్‌బెనర్జీ, గంజాల నాగరాజు అందజేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రేషన్ షాపుపై విజిలెన్స్ దాడి

పర్రచివర(నాగాయలంక): మండలంలోని పర్రచివర శివారు పెదగొడపాలెంలోని రేషన్ డీలర్ షాపుపై రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఏడీ ఒమర్ నేతృత్వంలో మంగళవారం దాడి చేశారు. పెదగొడపాలెం డీలర్ తాతా నాగమల్లేశ్వరి నిర్వహిస్తున్న షాపును తనిఖీ చేయగా 621 కేజీల రేషన్ బియ్యం అదనంగా ఉండటాన్ని గుర్తించారు. బియ్యం స్వాధీనం చేసుకుని తదుపరి చర్యలు నిమిత్తం పీడీఎస్ డెప్యూటీ తహసీల్దార్ ఖాసిం బాబుకు అప్పగించారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతి

- ప్రమాద ఘటికలు మోగిస్తున్న వంతెన
- కుంగిన అప్రోచ్ రోడ్డు
- ప్రమాదాలబారిన పడుతున్న వాహనచోదకులు



రెయిలింగ్ విరిగిన మల్లంపూడి వంతెన

బంటుమిల్లి: మండల పరిధిలోని మల్లంపూడి గ్రామం వద్ద ఉప్పుటేరుపై నిర్మించిన వంతెన సరైన మరమ్మతులు లేక శిథిలావస్థకు చేరి ప్రమాద ఘటికలు మోగిస్తోంది. కృష్ణా-పశ్చిమగోదావరి జిల్లాలతోపాటు, బంటుమిల్లి-కలిదిండి మండలాల ప్రజల అవసరాల కోసం ఉప్పుటేరుపై ఆర్‌అండ్‌బీ అధికారులు వంతెన నిర్మించి దాదాపు 40 ఏళ్లు అవుతోంది. ఈ వంతెన నిర్మాణంతో తీర ప్రాంత ప్రజలకు దగ్గర మార్గం ఏర్పడింది. కాలక్రమంలో వాతావరణ ప్రతికూల పరిస్థితులతో వంతెన శిథిలావస్థకు చేరుకుంది. వంతెన నిర్మించి ఏళ్లు గడిచిపోవడం, తీరప్రాంత ఉప్పుగాలుల ప్రభావానికి వంతెనకు వినియోగించిన ఐరన్ దెబ్బతిని సిమెంటు పెచ్చులు ఊడిపోతున్నాయి. దీంతో రెయిలింగ్ దెబ్బతింటున్నది.

పెరిగిన భారీ వాహనాల రద్దీ

బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలతోపాటు కలిదిండి మండలంలో వేలాది ఎకరాల చేపల చెరువులు తవ్వడంతో భారీ వాహనాలతో రద్దీ ఏర్పడింది. వీటితోపాటు కృష్ణా-పశ్చిమగోదావరి జిల్లాల మధ్య ప్రయాణికుల వాహనాలు పెద్ద ఎత్తున రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ క్రమంలో వంతెన రెయిలింగ్ విరిగిపోవడంతోపాటు వంతెన పైన సిమెంట్ లేచిపోయి గుంతలు ఏర్పడ్డాయి. వంతెనకు ఇరువైపుల అప్రోచ్ రోడ్డు కుంగిపోయి రాత్రి వేళలో ప్రమాదాలబారిన పడుతున్నామని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే భారీ వాహనాల రాకపోకలతో పిల్లర్ల మధ్య ఉన్న స్పాన్ల మధ్యలో ఖాళీ ఏర్పడటంతో స్థానికులు మట్టిపోసి రెండింటి మధ్య ఖాళీని కప్పిపెట్టారు. వంతెనపై భారీ వాహనాలు నిలిపి చేపలు లోడింగ్ చేసుకుంటూ పనికిరాని చెత్తను రెయిలింగ్ పైనుంచి డ్రెయిన్‌లో వేస్తున్నారని దీని కారణంగా రెయిలింగ్ విరిగి నీటిలో పడిపోయిందని స్థానికులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి వంతెనకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



వంతెనపై రెండు స్పాన్ల మధ్య ఖాళీని మట్టితో వేసిన దృశ్యం

హెచ్చరిక బోర్డులు పెట్టాలి

ఉప్పుటేరుపై వంతెన నిర్మించి ఏళ్లు గడిచిపోవడంతో శిథిలావస్థకు చేరినందున వంతెనకు ఇరువైపుల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. వంతెన రెయిలింగ్ విరిగిన చోట హెచ్చరిక రిబ్బన్లు కట్టి వాహనదారులు రాత్రి సమయంలో ప్రమాదాలబారిన పడకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రభుత్వానికి నివేదిక పంపించాం

తాత్కాలిక మరమ్మతుల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించాం. రెయిలింగ్, అప్రోచ్ రోడ్డు మరమ్మతులకు రివైజ్డ్ అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి పంపి నిధులు మంజూరు కాగానే చర్యలు తీసుకుంటాం. వంతెన పరిశీలించి అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయిస్తాం.

– జేఈ కిషోర్,
బంటుమిల్లి ఆర్‌అండ్‌బీ సర్కిల్

శ్రీసుబ్రహ్మణ్యేశ్వరుడికి పంచామృత అభిషేకాలు



చల్లపల్లి: స్థానిక నిమ్మలతోటలో వేంచేసియున్న అయ్యప్పస్వామి క్షేత్రంలో మంగళవారం శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అష్టమ(8వ) ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా ఈ నెల మూడవ తేదీ చవితి నుంచి ఐదవ తేదీ షష్ఠి వరకు మూడు రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఉదయం ముద్రాంగ అర్చన, ముక్కాడి హారతి, కుమార హోమం అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, దివ్య అలంకరణలు చేశారు. సాయంత్రం మహానివేదన, శ్రీమాలికాపురత్తమ్మ అమ్మవారికి త్రిశక్తి సహిత కుంకుమార్చన, లలితా సహస్ర నామార్చన వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహోత్సవాల్లో ముగింపు రోజైన బుధవారం ఉదయం శేమేళీ, గణపతి హోమం, అయ్యప్పస్వామికి అష్టాదశ కలశాభిషేకం, అన్నాభిషేకం, దివ్య అలంకరణ, దర్శనం అనంతరం గం.11.30ల నుంచి అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

ఖాతాదారుల సంక్షేమమే లక్ష్యం

సప్తగిరి గ్రామీణ బ్యాంకు గుడివాడ రీజనల్ ఎఫ్ఎల్‌సీ శ్రీనివాసరావు

ఘంటసాల: ఖాతాదారుల సంక్షేమమే లక్ష్యంగా సప్తగిరి గ్రామీణ బ్యాంకు పని చేస్తుందని ఆ బ్యాంకు గుడివాడ రీజనల్ ఆఫీసు ఎఫ్ఎల్‌సీ కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఘంటసాల సప్తగిరి గ్రామీణ బ్యాంకులో నాబార్డు వారి సౌజన్యంతో ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు, రూ. 2 లక్షల బీమా చెక్కు పంపిణీ కార్యక్రమాన్ని మేనేజర్ జి.శ్రీనివాస్ దయాళ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఎల్‌సీ శ్రీనివాసరావు మాట్లాడుతూ సప్తగిరి గ్రామీణ బ్యాంకులో మహిళలకు డ్వాక్రా రుణాలు, రైతులకు వ్యవసాయ, బంగారు రుణాలు, వ్యాపారస్తులకు ముద్ర, విద్యా రుణాలతో పాటు ఖాతాదారులకు, సీనియర్ సిటిజన్స్‌కు అధిక వడ్డీ చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఘంటసాల సప్తగిరి బ్యాంకులో సబ్సిడీ రుణాలు, సూర్య ఘర్ పథకం అందించడంతో పాటు ఖాతాదారులకు సకాలంలో సేవలందించడంలో తమ సిబ్బంది ముందంజలో ఉంటారని మేనేజర్ శ్రీనివాస్ దయాళ్ తెలిపారు. అనంతరం సప్తగిరి గ్రామీణ బ్యాంకులో వ్యవసాయ, బంగారు రుణాలు తీసుకున్న వి.రుద్రవరం గ్రామానికి చెందిన ఖాతాదారుడు తూము శేఖర్ ఇటీవల ఆకస్మికంగా మృతిచెందగా ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన కట్టుకోవడంతో రూ.2 లక్షల చెక్కును ఆయన సతీమణి గోవర్ధనకు అందించారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు గొర్రెపాటి రామకృష్ణ, అహోబలరావు, విజయ్‌కుమార్, గొర్రెపాటి శ్రీనివాస్, వడ్లమూడి వెంకట కృష్ణారావు, జంజనం శ్రీధర్, బ్యాంకు ఉద్యోగులు సతీష్, హరిత, శ్రీనివాసరావు, ఖాతాదారులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



బీమా చెక్కు అందిస్తున్న ఎఫ్ఎల్‌సీ శ్రీనివాసరావు, బ్యాంకు సిబ్బంది

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మచిలీపట్నంటౌన్: పలు రంగాల్లో పని చేస్తున్న కార్మికులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నవజీవన్ బాల భవన్ సంస్థ ప్రతినిధి జ్యోతి పిలుపునిచ్చారు. స్థానిక రైల్వే స్టేషన్ వద్ద ఉన్న ఆటోస్టాండ్ వద్ద మంగళవారం ఆటో కార్మికులకు, ప్రజలకు మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలపై ఆమె అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. రైల్వే స్టేషన్ ప్రాంతంలో మత్తు పదార్థాలకు బానిసలై పిల్లలు సంచరిస్తే తెలియజేయాలని ఆటో కార్మికులను కోరారు. మత్తు పదార్థాల నుంచి సమాజాన్ని కాపాడేందుకు తమ నవజీవన్ బాల భవన్ సంస్థ ఎప్పుడూ కృషి చేస్తుందని పేర్కొన్నారు.

ఆలయ పునఃప్రతిష్టకు ప్రత్యేక పూజలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని ఈడేపల్లి కురుమవీధిలో జీర్ణోద్ధరణ చేసిన ప్రాచీన శ్రీ అయోధ్య రామ, బీరప్పస్వామి ఆలయంలో ఈనెల 6వ తేదీన పునఃప్రతిష్ఠించనున్న విగ్రహాలకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మశ్రీ శ్రీ విష్ణుభట్ల సూర్యనారాయణ శర్మ ఘనాపాఠి, ఆయన శిష్య బృందం బ్రహ్మత్వంలో గురువందనం, గణపతి పూజ, పుణ్యాహవాచనం, వాస్తు పూజ, హోమం, పర్యాగ్ని కరణం, యాగశాల ప్రవేశం, షోడశస్తంభ పూజ, అఖండ స్థాపన, అంకురారోపణ, వాస్తు, క్షేత్రపాలక, చతుషష్ఠి యోగిని, నవగ్రహ పరివార దేవత ఆవాహనలు, విగ్రహసూక్తి, ఆలయ శుద్ధి, జలాధివాసము, క్షీర, పంచామృత, పంచగవ్య, అధివాసములు మొదలైన పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



పూజలందుకుంటున్న విగ్రహాలు

బంగారు నాణెం అందజేత

గూడూరు: పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే లక్ష్యంగా కృష్ణా మిల్క్ యూనియన్ పనిచేస్తుందని యూనియన్ సభ్యుడు అర్జా వెంకట నగేష్ అన్నారు. కృష్ణామిల్క్ యూనియన్ అమలు చేస్తున్న కల్యాణ మస్తు పథకంలో భాగంగా మండలంలోని ఆకులమన్నాడు పాల ఉత్పత్తిదారుల సంఘంలోని గొరిశెట్టి వెంకన్నబాబు కుమార్తె వివాహాన్ని పురస్కరించుకుని మంగళవారం రూ. 20వేల బంగారు నాణెన్ని బహూకరించారు. కార్యక్రమంలో గుడ్లవల్లేరు పాల శీతలీకరణ మేనేజర్ తోట సత్యనారాయణ, రూట్ సూపర్‌వైజర్ బసవరాజు, ఆకులమన్నాడు పాల సేకరణ సంఘ అధ్యక్షుడు రంగిశెట్టి హరినాథ్ బాబు, వేతన కార్యదర్శి ఎస్ అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు బంగారు నాణెం అందజేస్తున్న అర్జా వెంకట నగేష్

ఉత్తమ అసిస్టెంట్ లైన్‌మన్‌గా రవిబాబు

ఘంటసాల: ఉయ్యూరులోని టీటీడీ కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన లైన్‌మన్ దివస్ – 2025 కార్యక్రమంలో తోట్లవల్లూరులో అసిస్టెంట్ లైన్‌మన్‌గా పని చేస్తున్న ఘంటసాల గ్రామానికి చెందిన కొడాలి రవిబాబు విద్యుత్తు శాఖ ఉయ్యూరు డివిజన్ పరిధిలో ఉత్తమ అసిస్టెంట్ లైన్‌మన్‌గా ఉన్నతాధికారుల చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. రెండుసార్లు విద్యుత్తు శాఖలో ఉత్తమ అసిస్టెంట్ లైన్‌మన్‌గా ప్రశంసా పత్రం అందుకోవడం అభినందనీయమని పలువురు ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు రవిబాబును అభినందించారు.



ప్రశంసా పత్రం అందుకుంటున్న రవిబాబు

దాడి చేసిన కేసులో జైలు శిక్ష

చిలకలపూడి(మచిలీపట్నం): ఓ గిరిజనుడిని కులం పేరుతో దూషించి దాడి చేసిన కేసులో నిందితులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి ఎస్. చినబాబు మంగళవారం తీర్పు చెప్పారు. బందరు మండలం చిన్నాపురం గ్రామానికి చెందిన గిరిజనుడు కొమరగిరి నాగరాజును 2018 ఫిబ్రవరిలో అదే గ్రామానికి చెందిన కాగిత నాగరాజు, కాగిత ఆంజనేయులు కులం పేరుతో దూషించి కర్రలతో గాయపరిచారు. దీనిపై బందరు తాలూకా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసు ఆధారంగా ఏపీపీ కమ్మగంటి చంద్రశేఖరరావు 10 మంది సాక్ష్యులను ప్రవేశపెట్టడంతో విచారించిన అనంతరం ఇరువురు నిందితులపై నేరం రుజువు కావడంతో శిక్ష విధించారు. కాగిత నాగరాజు రెండు సంవత్సరాలు జైలు శిక్ష, రూ. 5,500 జరిమానా, కాగిత ఆంజనేయులుకు ఒక సంవత్సరం జైలు శిక్ష, రూ. 5,500 జరిమానా విధించారు. జరిమానాగా వచ్చిన మొత్తంలో రూ. 10 వేలను బాధితునికి నష్టపరిహారంగా చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

ప్రధాన రోడ్లకు మరమ్మతులు



కోసూరువారిపాలెం(మోపిదేవి): మండలంలోని రెండు ప్రధాన రహదారులకు మరమ్మతులు చేపట్టారు. మోపిదేవి హైవే రోడ్డు నుంచి కోసూరువారిపాలెం గ్రామ ప్రధాన రహదారి అభివృద్ధికి రూ. 30 లక్షలు మంజూరుకాగా, వెంకటాపురం నుంచి 216 జాతీయ రహదారి వరకు ఉన్న రోడ్డుకు రూ. 20 లక్షల నిధులు మంజూరైనట్లు ఆర్‌అండ్‌బీ శాఖ డీఈఈ ఎం. రమేష్ తెలిపారు. ఈ నిధులతో రెండు ప్రధాన రహదారులను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు.

ఆక్రమణల తొలగింపు



మచిలీపట్నంటౌన్: నగరంలోని బస్టాండ్ సెంటర్‌లో ఉన్న ఆక్రమణలను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది మంగళవారం తొలగించారు. బస్టాండ్ సెంటర్‌లోని నటరాజ్ థియేటర్, బెల్ కంపెనీ ప్రహరీ వెంబడి నిర్మించిన దుకాణాలు, బడ్డీలను తొలగించారు. నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు, టౌన్‌ప్లానింగ్ అధికారి శ్రీహరిప్రసాద్ ఆక్రమణల తొలగింపును పర్యవేక్షించారు.

హైస్కూల్‌కు కంప్యూటర్లు బహూకరణ



నాగాయలంక: స్థానిక జెడ్పీ హైస్కూల్‌కు 1977–78 సంవత్సరం పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు మంగళవారం రూ.80వేలు విలువైన రెండు కంప్యూటర్లు, ఒక ప్రింటర్ బహూకరించారు. న్యాయవాది ఉప్పల వెంకటేశ్వరరావు, రిటైర్డ్ ఎంఈఓ భవిరి శంకరనాథ్, ఎస్‌బీబీవీ ప్రసాద్, పీవీజీ కృష్ణ, సైకం వెంకటేశ్వరరావు, యడవల్లి శ్రీమన్నారాయణ, చిట్టా హరేకృష్ణ, భీమా బాబురావుల బృందం వాటిని పాఠశాల హెచ్‌ఎం పీవీఎస్‌వీ ప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 అన్నపరెడ్డి రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

గూడూరు: ఐదుగుళ్లపల్లిలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయి సర్వస్వం కోల్పోయిన బాధితులకు చలమలశెట్టి ఛారిటబుల్ ట్రస్టు మంగళవారం నిత్యావసర వస్తువులు, వంట సామాగ్రి పంపిణీ చేసింది. సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావుకు చెందిన తాటాకు ఇల్లు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. ఈ నేపథ్యంలో స్పందించిన చలమలశెట్టి ట్రస్టు వారు బాధితులకు వంట సామాగ్రి, దుస్తులు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కమ్మిలి నాగేశ్వరరావు, కటకం జగన్మోహనరావు, చిలంకుర్తి వాసు, మేనేజర్ చలమలశెట్టి పాండురంగారావు పాల్గొన్నారు.

రేపు నాంచారమ్మ జాతరపై సమీక్ష

కోడూరు: కృష్ణాతీరంలో భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి జాతర ఏర్పాట్లకు సంబంధించి ఈనెల 6వ తేదీ గురువారం సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారిణి జయశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13, 14వ తేదీల్లో జరిగే జాతరపై బందరు ఆర్డీఓ అధ్యక్షతన వివిధ శాఖలాధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దేవాలయ ప్రాంగణంలో జరిగే ఈ సమీక్షకు అన్ని శాఖలాధికారులు హాజరుకావాలని జయశ్రీ కోరారు.

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయం

కోనేరుసెంటర్: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా పంచాయతీ కార్యదర్శులు పని చేయాలని డీఎల్‌పీఓ సీతారామయ్య పేర్కొన్నారు. మండలంలోని అరిసేపల్లి గ్రామ పంచాయతీలో మంగళవారం ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ల నిర్వహణ, చెత్త నుంచి సంపద తయారు, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణపై మచిలీపట్నం, పెడన, గూడూరు మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులకు, పారిశుద్ధ్య కార్మికుల (క్లాప్ మిత్ర)కు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీతారామయ్య మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ల నిర్వహణ, ప్రభుత్వ ప్రాధాన్యతలను వివరించారు. అలాగే గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం, దాని నిర్వహణలో అవలంభించాల్సిన పద్ధతులు, వర్మీ కంపోస్ట్ తయారు చేయు విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం కళాజాతర నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు క్లాప్ మిత్రలను సత్కరించారు. మచిలీపట్నం ఈఓపీఆర్డీ ఎ. బాలకృష్ణారావు, ఆయా మండలాల పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.



అరిసేపల్లిలో తడి-పొడి చెత్తను వేరు చేయడంపై అవగాహన కలిగిస్తున్న డీఎల్‌పీఓ సీతారామయ్య

ఘంటసాల: ఘంటసాల మండలంలోని వివిధ గ్రామాల్లో తడి-పొడి చెత్త సేకరణ, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఈఓపీఆర్డీ కే వెంకటేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. ఘంటసాల పంచాయతీలో ఈఓ జయలక్ష్మి గ్రీన్ అంబాసిడర్ల తడి-పొడి చెత్త సేకరణను పరిశీలించి ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే చినకళ్లేపల్లి, మల్లంపల్లి గ్రామాల్లో ఈఓ అబ్దుల్ సయూమ్, కొడాలి గ్రామంలో ఈఓ నాగమణి పర్యవేక్షణలో సచివాలయ ఉద్యోగులు చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రీన్ అంబాసిడర్లకు సహకరించాలని కోరారు.

మట్టి నమూనాల సేకరణపై శిక్షణ

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): భూసార పరీక్షల వల్ల నేలలో ఉండే స్థూల, సూక్ష్మ పోషక విలువలను తెలుసుకోవచ్చునని ఘంటసాల కేవీకే సమన్వయ కర్త డాక్టర్ డీ సుధారాణి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఉత్తరచిరువోలు లంకలో మట్టి నమూనా సేకరణ, భూసార పరీక్ష ప్రాముఖ్యతపై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ కావలసిన మేరకే ఎరువులను వినియోగించి నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. మట్టి నమూనా సేకరణ విధానాన్ని, పాటించవలసిన మెళకువలను వివరించారు. సస్య రక్షణ శాస్త్రవేత్త డాక్టర్ రేవతి, డాక్టర్ వెంకటలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ సుబ్బారెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.



రైతులకు శిక్షణనిస్తున్న డాక్టర్ సుధారాణి

రంగవల్లులతో రైతులకు అవగాహన

తాడేపల్లి(ఘంటసాల): ఘంటసాల మండలం తాడేపల్లి గ్రామంలో మంగళవారం రైతులకు బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తాడేపల్లి పంచాయతీ పరిసరాల్లో పంటలు తెలిపేలా రంగవల్లులతో గ్రామ స్వరూపాన్ని వేశారు. రైతులకు గ్రామం, వ్యవసాయ భూముల విస్తరణ, గ్రామ పటం, సీజనల్ క్యాలెండర్, ఇతర వివరాలతో వివిధ అంశాలను చిత్రాలతో వివరించారు. రైతులకు వ్యవసాయంలో వస్తున్న సాంకేతిక మార్పులు, లాభసాటి వ్యవసాయంపై వివరిస్తూ పంట పొలాలకు వెళ్లి రైతులతో మాట్లాడారు. వ్యవసాయంపై తమకు తెలియని విషయాలను తెలుసుకోవడంతో పాటు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి, శాస్త్రవేత్తలు డాక్టర్ బీ నవీన్, రేవతి, రైతులు డీ శివనాగేశ్వరరావు, ఎ బసవేశ్వరరావు, టీ శ్రీనివాసరావు, వై వీరభద్రరావు, రత్నగిరిరావు, కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కలిగిస్తున్న బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు

రెండు వైన్ షాపుల సీజ్

పెడన: బెల్టు దుకాణాల్లో సరుకు ఆయా షాపులకు చెందినవిగా గుర్తించడంతో పాటు పలు మార్లు కేసులు నమోదు కావడంతో ఆయా షాపుల లైసెన్సులను రద్దు చేసినట్లు మచిలీపట్నం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్ తెలిపారు. ఎక్సైజ్ సూపరిండెంట్ ఆదేశాల మేరకు పెడన మండలం చేవేంద్రలోని ఆదిత్య వైన్ షాపు, బలిపర్రులోని దేవి వైన్ షాపుల లైసెన్సులను మంగళవారం రద్దు చేసి సీజ్ చేయడం జరిగిందని పేర్కొన్నారు. బెల్టు దుకాణాలకు ఆ రెండు షాపుల నుంచి మందు సరఫరా అవుతోందని ఆయన పేర్కొన్నారు.

పత్రికా ప్రకటన

చెన్నూరు గ్రామ కాపురస్థులైన గుర్రీకల్లి రామారావు [illegible] ఆస్తి కలదు. ఆయన తదనంతరం వారి [illegible] గుర్రీకల్లి [illegible] వెంకట శ్రీనివాసరావు, [illegible] సర్వే నంబరు 1067/2017 [illegible] ...

కె. నాగమల్లేశ్వరరావు, అడ్వకేటు, మచిలీపట్నం